ప్రజాశక్తి
బుధవారం 13 మార్చి 2024 5
అనంతపురం






సిఎఎకు వ్యతిరేకంగా అనంతపురం టవర్‌క్లాక్ వద్ద నిరసన తెలుపుతున్న సిపిఎం నాయకులు

రాప్తాడు..అభివృద్ధి లేదు..!

◆ బంగారు గనులున్నా ప్రయోజనం శూన్యం
◆ సాగునీటి ప్రాజెక్టులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే
◆ అన్నింటా రాప్తాడు నియోజకవర్గం వెనుకబాటు
◆ నీటి మూటల్లా నాయకుల ఎన్నికల హామీలు





ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

'అన్నీ ఉన్నా అల్లుని నోట్లో శని' అన్న చందంగా మారింది రాప్తాడు అసెంబ్లీ నియోజకవర్గం పరిస్థితి. ఇక్కడి భూమి పొరల్లో బంగారు నిక్షేపాలున్నా... నిష్ఫలమే. వాటిని వెలికితీసే పనులేవి ముందుకు సాగడం లేదు. ఎన్నికలొచ్చాయంటే చాలు వాటిని తెరిపిస్తామన్న హామీ మాత్రం వినిపిస్తూనే ఉంటుంది. అధికారంలోకి వచ్చాక తొలినాళ్లలో కొంత హడావుడి నడుస్తుంది. ఆ తరువాత ఒక్క అడుగు కూడా ముందుకు పడదు. పాలకులు ఎవరొచ్చినా దీనిపై దృష్టి పెడుతున్న దాఖలాల్లేవు. రామగిరిలో బంగారు గనులను తెరిపిస్తామని 2014లో టిడిపి అధికారంలోకి వచ్చాక ప్రకటించారు. ఈ మేరకు గనుల శాఖ మంత్రిగానున్న పీతల సుజాత కూడా వచ్చి పరిశీలించారు. కాని ఆ ప్రభుత్వ హయాంలో దీనికి సంబంధించి ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు. 2019లో వైసిపి అధికారంలోకి వచ్చాక కూడా ఈ గనులను తెరిపిస్తున్నట్టు విదేశీ ప్రతినిధులు సైతం వచ్చి వెళ్లారు. టెండర్ల దశ వరకు కూడా సాగింది. కాని ఇప్పటికి ప్రారంభమయ్యే సూచనలు కనిపించలేదు. ఇది ప్రారంభమయితే కొంత మందికైనా ఇందులో ఉపాధి దొరుకుతుందని ఆ ప్రాంతవాసులు ఎదురు చూస్తున్నారు.

ఒకటి కాదు..మూడు అన్నారు..

పెన్నా నదిపై నిర్మించిన పేరూరు ప్రాజెక్టుకు ఎగువ నుంచి నీరొచ్చే అవకాశం లేకపోవడంతో వట్టిపోయింది. దీనికి హంద్రీనీవా నుంచి ఎత్తిపోతల ద్వారా సాగునీటిని అందివ్వాలని అంతకు మునుపు టిడిపి హయాంలో రూ.803 కోట్లతో పనులు కొంత ప్రారంభించారు. అయితే ఆ తరువాత వైసిపి ప్రభుత్వం వచ్చాక కొంతకాలం పనులు ఆపింది. ఇవే నిధులతో ఒక్క ప్రాజెక్టు కాకుండా సోమరవాండ్లపల్లి, తోపుదుర్తి ముట్టాల మూడు రిజర్వాయర్లు నిర్మించి లక్ష ఎకరాలకు నీటిని అందిస్తామని ప్రకటించారు. ఈ మేరకు శంకుస్థాపన చేశారు. ముఖ్య మంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి కూడా ఈ ప్రాజెక్టు పూర్తి చేస్తామని హామీనిచ్చారు. అయితే ఇప్పటి వరకు భూ సేకరణకు అవసరమైన నిధులే విడుదల చేయలేదు.

పరిశ్రమలు రాలేదు..పోయాయి...!

ఈ ప్రాంతంలో ఉపాధి కల్పించే పరిశ్రమలు తీసుకొస్తున్నట్టు రెండు పార్టీల నాయకులు ప్రకటించారు. జాకీ వచ్చిందని ప్రకటించారు. అంతకు మునపు జిందాల్ ఉక్కు పరిశ్రమ ఏర్పాటు ప్రతిపాదనలు వచ్చాయి. అయితే ఈ రెండూ ఇక్కడ ఏర్పాటవకుండానే తరలిపోయాయి. కొత్తగా ఒక్క పరిశ్రమ కూడా రాలేదు. కొత్త పరిశ్రమలు వస్తాయని స్థానిక ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి పలుమార్లు ప్రకటించారు. కాని ఆచరణకు నోచుకోలేదు.

మౌలిక సదుపాయలు అంతంత మాత్రమే..

నియోజకవర్గంలో మౌలిక సదుపాయలు అంతంత మాత్రంగానే ఉన్నాయి. ఇప్పటికీ తాగునీటికి అనేక చోట్ల ఇబ్బందులు తప్పడం లేదు. రహదారి సమస్యలు ఇంకా అనేక చోట్ల ఉన్నాయి. మౌలిక సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యతను ఇచ్చి వాటిని పరిష్కరిస్తామంటూ నాయకులు ఇచ్చే మాటలు నీటిమూటల్లా మారుతున్నాయి.



టిడిపి ప్రభుత్వ హయాంలో పేరూరు డ్యాంను పరిశీలిస్తున్న అప్పటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు (ఫైల్‌ఫొటో)



రామగిరి బంగారు గనులను అమెరికాకు చెందిన ప్రతినిధులతో కలిసి పరిశీలిస్తున్న రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి (ఫైల్ ఫొటో)

సిఎఎతో ప్రజల ఐక్యతకు విఘాతం

◆ తక్షణం ఈ చట్టాన్ని రద్దు చేయాలి
◆ సిపిఎం ఆధ్వర్యంలో అనంతలో నిరసన

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న వేళ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం వివాదాస్పద పౌరసత్వ సవరణ చట్టాన్ని ముందుకు తీసుకొచ్చి, ప్రజల ఐక్యతకు విఘాతం కలిగించే చర్యలకు పూనుకోవడం అత్యంత దుర్మార్గమైన చర్యని సిపిఎం నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజల మధ్య ఐక్యతను దెబ్బతీసేలా పౌరసత్వ సవరణ చట్టం(సిఎఎ)ను తీసుకురావడాన్ని వ్యతిరేకిస్తూ అనంతపురంలో సిపిఎం ఒకటవ నగర కమిటీ ఆధ్వర్యంలో టవర్ క్లాక్ దగ్గర మంగళవారం సాయంత్రం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం ఒకటవ నగర కార్యదర్శి వి.రామిరెడ్డి మాట్లాడుతూ వివక్షా పూరిత చట్టం అమలుకు కేంద్ర హోంమంత్రిత్వ శాఖ నోటిఫికేషన్ జారీ చేసిందన్నారు. ఇది ప్రజల మధ్య ఐక్యతను దెబ్బతీస్తుందని విమర్శించారు . ఫాసిస్టు హిందుత్వాన్ని రెచ్చగొట్టి ప్రజల మధ్య విభజన తీసుకొచ్చే ప్రమాదం ఉందన్నారు. బిజెపి రానున్న ఎన్నికల్లో లబ్ధి పొందాలనే దురుద్దేశంతోనే ఈ బిల్లును హడావుడిగా అమల్లోకి తెచ్చారన్నారు. వివక్షతను చూపే పౌరసత్వ సవరణ చట్టాన్ని గతంలో పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన సమయంలో ప్రతిపక్షాల బహిష్కరణ మధ్య అత్యంత అప్రజాస్వామిక రీతిలో బిజెపి ప్రభుత్వం ఆమోదింపజేసుకుందని తెలియజేశారు. కేరళ రాష్ట్రంలో సిఎఎను అమలు చేయమని అక్కడి వామపక్ష ప్రభుత్వం తేల్చిచెప్పడం హర్షించదగ్గ విషయమన్నారు. దేశంలో ప్రజల మధ్య చీలికతెచ్చి కల్లోలం రేపాలన్న లక్ష్యంతోనే బిజెపి సిఎఎను అమలు చేస్తోందని విమర్శించారు. ప్రజల ఐక్యతను దెబ్బతీసే ఈ చట్టాన్ని దేశ ప్రజలంతా ఐక్యంగా తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. ముస్లిం మైనార్టీలను ద్వితీయ శ్రేణి పౌరులుగా పరిగణించే ఈ చట్టాన్ని అన్ని రాష్ట్రాల్లోనూ అమలు చేయకుండా ఆయా ప్రభుత్వాలు నిర్ణయం తీసుకోవాలని కోరారు. బలవంతంగా సిఎఎను అమలు చేయాలని చూస్తే ప్రజల మద్దతుతో రానున్న ఎన్నికల్లో బిజెపి, దాన్ని బలపరుస్తున్న మిత్ర పక్షాలను ప్రజలందరూ ఓడించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు చంద్రశేఖర్ రెడ్డి, వెంకటనారాయణ, నగరకమిటీ నాయకులు బాలకృష్ణ, రాజు, గఫూర్, వెంకటేశ్, లక్ష్మీనారాయణ, బాబా, ఎర్రిస్వామి, శంషాద్, రవి, ఆనంద్, రామాంజనేయులు, లక్ష్మీదేవి, ఫక్రున్నీ, రవి, మాబ్బీ పాల్గొన్నారు.

అనంతలో వందే భారత్ రైలు

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

వందే భారత్ రైలు మంగళవారం నాడు అనంతపురం రైల్వే స్టేషన్‌కు వచ్చింది. కర్నాటక రాష్ట్రం కలబురగి నుంచి బెంగళూరుకు నడిచే ఈ రైలు అనంతపురం వచ్చిన సందర్భంగా నగర మేయర్ మహమ్మద్ వసీం, ఎమ్మెల్సీ మంగమ్మ, స్టేషన్ మేనేజర్ అశోక్ , డిప్యూటీ మేయర్లు వాసంతి, విజయ భాస్కర్‌రెడ్డిలు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ నూతన సాంకేతిక పరిజ్ఞానంతో నడిచే వందేభారత్ రైలు అత్యంత వేగంగా వెళ్తుందన్నారు. వివిధ ప్రాంతాలను కలుపుకుని ఉమ్మడి అనంతపురం జిల్లాల మీదుగా ఈ రైలు వెళ్లడం ఇక్కడి ప్రజలకు ఎంతో ఉపయోగకరం అన్నారు. తక్కువ సమయంలోనే ఆయా ప్రాంతాలకు చేరుకునే వెసులుబాటు ఉంటుందన్నారు. వందేభారత్ ట్రైన్ వచ్చిన సందర్భంగా దానిని చూసేందుకు పెద్ద సంఖ్యలో నగర ప్రజలు విచ్చేశారు. ట్రైన్ ఎదుట సెల్ఫీలు తీసుకున్నారు.



వందేభారత్ రైలును జెండా ఊపి ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ, మేయర్ తదితరులు

పారదర్శకంగా ఎన్నికలను నిర్వహిద్దాం

◆ అన్ని విధాలా అధికారులు సన్నద్ధం కావాలి ◆ కలెక్టర్ ఎం.గౌతమి, ఎస్పీ కెకెఎన్.అన్బురాజన్

ప్రజాశక్తి-అనంతపురం

ఎన్నికల కమిషన్ సూచనలను పాటించి పారదర్శకంగా ఎన్నికలను నిర్వహించేందుకు అన్ని విధాలా సన్నద్ధం కావాలని కలెక్టర్ ఎం.గౌతమి, ఎస్పీ కెకెఎన్.అన్బురాజన్ అధికారులను ఆదేశించారు. సాధారణ ఎన్నికల నేపథ్యంలో అనంతపురం కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవనంలో మంగళవారం ఉదయం ఆర్‌ఒలు, డీఎస్పీలు, ఏఆర్‌ఒలు, ఎన్ఫోర్స్మెంట్ ఏజెన్సీలు, ఈడిటిలతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల నోటిఫికేషన్ ఏ క్షణమైనా వచ్చే అవకాశం ఉన్నాయన్నారు. ఈ నేపథ్యంలో ఎన్నికల నిర్వహణకు సర్వం సన్నద్ధంగా ఉండాలన్నారు. అసెంబ్లీ స్థాయిలో సమన్వయ సమావేశాలు నిర్వహించాలని ఆర్‌ఒలను ఆదేశించారు. ఆర్‌ఒలు సంబంధిత పోలీస్ అధికారులతో సమన్వయం చేసుకుని పని చేయాలన్నారు. ఐటీ అప్లికేషన్‌లపై పూర్తిస్థాయిలో అవగాహన ఉండాలన్నారు. ప్రతి అంశానికి సంబంధించి ఒక నోడల్ అధికారిని నియమించామని, వారు నిత్యం మానిటర్ చేస్తూ ఉండాలన్నారు. ఎన్నికలను మానిటర్ చేయడానికి జిల్లా స్థాయిలో కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేస్తామన్నారు. ఎంసిసి, ఈఎస్ఎంఎస్, సీవిజిల్, తదితర వాటి నుంచి ఎలాంటి ఫిర్యాదు వచ్చినా సంబంధిత అధికారులకు పంపుతామన్నారు. ఎంసిసి (మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్)కి సంబంధించి ఎక్కువ ఫిర్యాదులు వచ్చే అవకాశం ఉందని, ఫిర్యాదు అందిన వెంటనే సకాలంలో విచారణ చేసి రిపోర్టులు అందించి చర్యలు తీసుకోవాలన్నారు. వచ్చే రెండు రోజుల్లోపు సెబ్, ఐటి బృందాలను ఏర్పాటు చేయాలన్నారు. జిల్లాలోని అంతర్‌రాష్ట్ర సరిహద్దుల్లో చెక్‌పోస్టులను ఏర్పాటు చేశామని, అక్కడ ప్రతి వాహనాలను కచ్చితంగా తనిఖీ చేయాలన్నారు. కళ్యాణదుర్గం, రాయదుర్గం, ఉరవకొండ, రాప్తాడు నియోజకవర్గాల పరిధిలో అంతర్‌రాష్ట్ర సరిహద్దు ప్రాంతాల్లో అధికారులతో సమన్వయం ఉండాలన్నారు. రౌడీషీటర్లను సైతం గుర్తించి ఎన్నికలు సజావుగా నిర్వహించేలా అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్నికల నేపథ్యంలో అధికారులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎస్పీ అన్బురాజన్ మాట్లాడుతూ సాధారణ ఎన్నికలు నేపథ్యంలో అధికారులు, పోలీసుల మధ్య సమన్వయం అత్యంత కీలకమన్నారు. క్షేత్రస్థాయిలో, గ్రామ, మండల స్థాయిలో కూడా అధికారుల మధ్య ప్రతి రోజూ సమన్వయం ఉండాలన్నారు. జిల్లాలో స్టాటిక్, డైనమిక్ చెక్‌పోస్టులు నడుస్తున్నాయని, అక్కడ సీజర్స్ ముఖ్యమన్నారు. ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు ప్రతి క్షణం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ కేతన్ గార్గ్, నగర పాలక సంస్థ కమిషనర్ మేఘస్వరూప్, జిల్లా పరిషత్ సీఈవో వైఖోమ్ నిదియా దేవి, డిఆర్‌ఒ జి.రామకృష్ణారెడ్డి, డిఐఒ రవిశంకర్‌తో పాటు ఆర్‌ఒలు, డీఎస్పీలు, ఎఆర్‌ఒలు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమి, ఎస్పీ అన్బురాజన్

వేతనాలు చెల్లించేంత వరకూ ఉద్యమం

సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.ఓబులు

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం

శ్రీరామిరెడ్డి తాగునీటి పథకంలో పనిచేస్తున్న కార్మికులకు వేతనాలు పూర్తిస్థాయిలో చెల్లించేంత వరకూ ఉద్యమం ఆగదని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఓబులు హెచ్చరించారు. వేతనాలు చెల్లించాలని కోరుతూ స్థానిక పంప్‌హౌస్ వద్ద కార్మికులు రెండు రోజులుగా చేపట్టిన సమ్మెకు ఓబులు మంగళవారం సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇదివరకే కార్మికుల సమస్యల పరిష్కారం కోసం దశలవారీగా అనేక ఉద్యమాలు చేపట్టామన్నారు. నిరవధిక సమ్మె చేపట్టినా ప్రభుత్వానికి సిగ్గు లేదన్నారు. హక్కుగా రావాల్సిన వేతనాలను చెల్లించకపోవడం సిగ్గుచేటు అన్నారు. రాత్రి, పగలు కష్టపడుతున్న కార్మికులకు వేతనాలు అందించకపోతే కుటుంబాలు ఎలా గడవాలని నిలదీశారు. కార్మికుల సమ్మె కారణంగా నీటి సరఫరా కాకపోతే ప్రజలకు కూడా ఇబ్బంది ఏర్పడుతుందనే విషయం తెలిసినప్పటికీ ఉన్నతస్థాయి అధికారుల్లో చలనం లేకపోవడం వారి నిర్లక్ష్యానికి అద్దం పడుతుందని విమర్శించారు. వేసిన దృష్టిలో పెట్టుకుని అటు కాంట్రాక్టర్, ఇటు పాలకులు వెంటనే స్పందించి కార్మికులకు వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. రెండు రోజుల్లో సమస్యను పరిష్కరించకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.



అధికారులతో మాట్లాడుతున్న సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఓబులు

రాష్ట్రస్థాయి అబాకస్ పోటీల విజేతకు సన్మానం

ప్రజాశక్తి-ఉరవకొండ

విజయవాడలో జరిగిన రాష్ట్రస్థాయి అబాకస్ పోటీల్లో మూడోస్థానంలో విజయం సాధించిన ఉరవకొండకు చెందిన క్రీడాకారుడు కిషోర్‌ను సెపక్‌తక్రా క్రీడా సంఘం జిల్లా అధ్యక్షులు, సప్తగిరి మళ్లీ ఫౌండేషన్ వ్యవస్థాపకులు సప్తగిరి మల్లికార్జున ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సప్తగిరి మల్లికార్జున మాట్లాడుతూ ఉరవకొండలోని మహేశ్వరి ఇంగ్లీషు మీడియం పాఠశాలలో 4వ తరగతి చదువుతున్న కిషోర్ రాష్ట్రస్థాయిలో 3వ స్థానం సాధించడం అభినందించదగ్గ విషయమన్నారు. చిన్న వయసులోనే క్రీడల్లో పాల్గొనాలనే తపన ఉండడం అభినందించదగ్గ విషయమన్నారు. కిషోర్ తండ్రి సురేష్ ప్రయివేట్ డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తూ తన కుమారుడు బాగా చదువుకోవడంతో పాటు క్రీడలలో పాల్గొనేలా ప్రత్యేక శ్రద్ధ చూపారని కొనియాడారు. రాష్ట్రస్థాయిలో మూడవ స్థానం సాధించి ఉరవకొండ ప్రాంతానికి మంచి పేరు తీసుకొచ్చిన కిషోర్‌కు నగదు బహుమతి అందించడంతోపాటు జాతీయస్థాయిలో పాల్గొనేందుకు రానున్న వేసవికాలంలో అబాకస్ పోటీలపై శిక్షణ ఇప్పించేందుకు ఆర్థిక సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో సప్తగిరి, మళ్లి, ఫౌండేషన్ సభ్యులు ఉమా, తదితరులు పాల్గొన్నారు.



క్రీడాకారుడిని అభినందిస్తున్న సప్తగిరి మల్లికార్జున

17న మూర్ఛవ్యాధి వైద్యశిబిరం

అనంతపురం కలెక్టరేట్ : జన విజ్ఞాన వేదిక నగర కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 17న ఆదివారం మూర్ఛవ్యాధి వైద్యశిబిరం (ఫిట్స్ క్యాంప్)ను నిర్వహించనున్నట్లు కన్వీనర్ రామకృష్ణ, జెవివి నగర అధ్యక్షులు రామిరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలోని టవర్‌క్లాక్ వద్ద ఉన్న జనవిజ్ఞాన వేదిక కార్యాలయంలో ఆరోజు ఉదయం 6 గంలకు వైద్య శిబిరం ప్రారంభమవుతుందన్నారు. శిబిరంలో విజయవాడ నుంచి ప్రముఖ న్యూరాలజిస్ట్ డాక్టర్ శివన్నారాయణ పాల్గొని చికిత్స చేయనున్నట్లు తెలిపారు. జిల్లాలోని మూర్ఛవ్యాధిగ్రస్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కేంద్ర సాయుధ బలగాల కవాతు

ప్రజాశక్తి-అనంతపురం క్రైం

ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ ఆదేశాల మేరకు ఇటుకలపల్లి పోలీసుస్టేషన్ పరిధిలో ఉన్న కృష్ణంరెడ్డిపల్లి, పూలకుంట, చియ్యేడు, ఉప్పరపల్లి గ్రామాల్లో కేంద్ర సాయుధ బలగాలు మంగళవారం కవాతు నిర్వహించాయి. అనం తపురం రూరల్ డీఎస్పీ బి.వి.శివారెడ్డి, బిఎస్ఎఫ్ అసిస్టెంట్ కమాండర్ ధర్మేంద్రసింగ్, ఇటుకలపల్లి సి.ఐ నరేంద్రరెడ్డి, ఎస్ఐ రాఘవేంద్రరెడ్డి ఆధ్వర్యంలో ఆయా గ్రామాల్లోని ప్రధాన రహదారులు, ముఖ్యమైన కాలనీల గుండా కవాతు సాగింది. ప్రశాంత వాతావరణంలో సార్వత్రిక ఎన్నికలు నిర్వహించడమే లక్ష్యంగా పోలీసులు సంకల్పించారు. ప్రజల్లో ఉన్న భయాం దోళనను పోగొట్టి, రాజ్యాంగం ద్వారా సంక్రమించిన ఓటుహక్కును స్వేచ్ఛగా వినియోగించుకునేలా ప్రశాంత వాతవరణం కల్పించడమే పోలీసుల ధ్యేయమని పోలీసులు తెలిపారు. అనంతపురం రూరల్ సబ్ డివిజన్ స్పెషల్ పార్టీ సిబ్బంది పాల్గొన్నారు.



కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

మొక్కజొన్న రైతులు శాస్త్రవేత్తల సలహాలు పాటించాలి

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

మొక్కజొన్న పంట సాగు చేసిన రైతులు శాస్త్రవేత్తల సలహాలు పాటించి అధిక దిగుబడులు సాధించాలని మండల వ్యవసాయ అధికారి శ్యాంరెడ్డి సూచించారు. మంగళవారం మండల పరిధిలోని వడియంపేట గ్రామంలో బోరుబావుల కింద సాగు చేసిన మొక్కజొన్న పంటపొలాలను సందర్శించారు. ఈ సందర్భంగా ప్రస్తుతం పంట కంకి పాలు పోసుకునే దశలో ఉన్న నేపథ్యంలో కత్తెర పురుగు, ఆకు మాడు తెగులు ఆశించినట్లు అధికారులు గమనించారు. వీటి నివారణకు నివారణకు కోరాజిన్, రైనాక్సీఫర్ ఎకరాకు 60 మిల్లీలీటర్లు, 200 లీటర్ల నీటికి కలిపి పైరుపై పిచికారీ చేయాలని సూచించారు. ఆకు మాడు తెగులు నివారణకు 600 గ్రాములు ఎం-45, ప్రోఫీ కొనజోల్ 200 మి.లీ, 200 లీటర్ల నీటి కలిపి ఎకరానికు పిచికారీ చేయాలన్నారు. పొలం చుట్టూ మూడు, నాలుగు వరుసలు జొన్నపంటను ఎరపంటగా వేయాలన్నారు. 45 రోజుల తర్వాత తీసివేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎడిఎ శైలజ, వ్యవసాయాధికారి శ్రీనివాసులు, ఎఇఒ ప్రసాద్, గ్రామ వ్యవసాయ సహాయకులు శ్రీనివాస్, రైతులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న అధికారులు

పాతపెన్షన్ అమలును ఎన్నికల మేనిఫెస్టోలో చేర్చాలి : యుటిఎఫ్

ప్రజాశక్తి-రాయదుర్గం

రాబోయే ఎన్నికల్లో పాతపెన్షన్ విధానాన్ని అమలు చేస్తామని ఎన్నికల మేనిఫెస్టోలో చేర్చిన పార్టీకే తమ మద్దతు ఉంటుందని యుటిఎఫ్ నాయకులు స్పష్టం చేశారు. డి.హీరేహాల్ మండల కేంద్రంలోని వనరుల కేంద్రం ప్రాంగణంలో మంగళవారం యుటిఎఫ్ ఆధ్వర్యంలో 'ఓట్ ఫర్ ఓ పి ఎస్' పుస్తకాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆర్.మోహన్‌బాబు, జి.రామాంజనేయులు మాట్లాడుతూ గత ఎన్నికల సమయంలో తాము అధికారంలోకి వచ్చిన వారంలోపు సిపిఎస్‌ను రద్దు చేస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన సిఎం జగన్ ఐదేళ్లు పూర్తయినా పట్టించుకోలేదన్నారు. మాట నిలబెట్టుకోలేని ముఖ్యమంత్రిగా చరిత్రలో నిలిచిపోతారన్నారు. ప్రస్తుత ఎన్నికల్లో పాత పెన్షన్ విధానం అమలు చేసే వారికే ఉద్యోగులు ఓట్లు వేస్తారన్నారు.ఎపి సిపిఎస్ ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి కూన గంగాధర మాట్లాడుతూ పెన్షన్ భిక్ష కాదని, ఉద్యోగి హక్కు అన్నారు. కావున ఇప్పటికైనా రాజకీయ పార్టీల నాయకులు స్పందించి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జడ్పీహెచ్ఎస్ ఉన్నత పాఠశాల సీనియర్ సహాయకులు నాగరాజు, యుటిఎఫ్ మండల గౌరవాధ్యక్షులు టి.హనుమంతప్ప, సహాధ్యక్షులు రామచంద్రప్ప, ప్రతినిధులు వెంకోబ్రావ్, లోకాభిరాం, శ్రీనాథ్, కాశీనాథస్వామి, హరి, సిపిఎస్ ఉద్యోగుల సంఘం నాయకులు జి.ఎస్.హనుమంతప్ప, అయ్యన్న, బసవరాజు, ఈరాలప్ప, ఉపాధ్యాయులు రమేష్, నాగరాజు, ఉరుకుందప్ప, నాగలింగయ్య, జయశ్రీ, విజయమ్మ, భార్గవి, కేదారేశ్వరి, గాయత్రి, నాగవేణి, రామలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్లను విడుదల చేస్తున్న యుటిఎఫ్ నాయకులు

మీ ఇంటి బిడ్డగా వస్తున్నా.. ఆశీర్వదించండి : శ్రావణిశ్రీ

ప్రజాశక్తి-నార్పల

'మీ ఇంటి బిడ్డగా ప్రజాక్షేత్రంలోకి వస్తున్నా.. ఆశీర్వదించి చెలిపించండి..' అంటూ నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి బండారు శ్రావణిశ్రీ విజ్ఞప్తి చేశారు. మంగళవారం మండల పరిధిలోని బి.పప్పూరు గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ చిన్న, చిన్న కలహాలు, సమస్యలు ఉనా మనమంతా ఒక్కటే కుటుంబ సభ్యులం అన్నారు. ఐకమత్య బలంతో ఉంటే మనదే విజయం అన్నారు. మన విజయానికి జనసేనా పార్టీ బలం కూడా తోడవుందన్నారు. 2024 ఎన్నికల్లో ఎమ్మెల్యేగా గెలిచి చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌కు గిఫ్ట్‌గా ఇద్దామని పిలుపునిచ్చారు. సమయం తక్కువగా ఉన్నందున ప్రతి గ్రామానికి వెళ్లి ప్రభుత్వ వైఫల్యాలను వివరిద్దామన్నారు. అంతేగాకుండా టిడిపి అధికారంలోకి వస్తే అమలు చేయనున్న పథకాలను ప్రతి ఇంటికీ తెలియజేద్దామన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి ఆలం నరసానాయుడు, టిడిపి జిల్లా సీనియర్ నాయకులు ఆలం వెంకట నరసానాయుడు, ఆకుల ఆంజనేయులు, రంగారెడ్డి, జనసేన నాయకులు సాకే మురళీకృష్ణ, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న బండారు శ్రావణిశ్రీ

మహిళల హక్కుల కోసం పోరాటాలు : ఐద్వా

ప్రజాశక్తి-గుంతకల్లు

మహిళల హక్కుల కోసం అలుపెరుగని పోరాటాలు చేస్తున్నామని ఐద్వా మహిళా సంఘం పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు జ్యోతి, రంగమ్మ తెలిపారు. మంగళవారం పట్టణంలోని సిఐటియు కాలనీలో ఐద్వా మహిళా సంఘం ఆవిర్భవ దినోత్సవం సందర్భంగా జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఐద్వా మహిళా సంఘం స్థాపించినప్పటి నుంచి మహిళలు ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై అలుపెరుగని పోరాటాలు చేస్తున్నట్లు వివరించారు. ప్రజాస్వామ్యంలో మహిళలకు సమాన హక్కులు, స్త్రీ విముక్తి, చట్టసభల్లో ప్రాధాన్యత ఇవ్వాలన్న అనేక అంశాలపై సుదీర్ఘమైన పోరాటాలు చేస్తోందన్నారు. రాబోయే కాలంలో కూడా మద్యపానం నిషేధం, మహిళలపై దాడులు, అత్యాచారాలకు వ్యతిరేకంగా పెద్దఎత్తున పోరాటాలు కొనసాగించనున్నట్లు స్పష్టం చేశారు.



జెండాను ఎగురవేస్తున్న ఐద్వా నాయకులు

టిడిపిలో పలువురు చేరిక

రాయదుర్గం : మండలంలోని చదం గొల్లలదొడ్డి, ఆవులదట్ల గ్రామాల చెందిన పలువురు వైసిపి నుండి మంగళవారం టిడిపిలోకి చేరారు. మండల కన్వీనర్ హనుమంతు ఆధ్వర్యంలో పార్టీలో చేరిన వారికి మాజీమంత్రి కాలవ శ్రీనివాసులు కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా వైసిపి ఆవిర్భావ దినోత్సవం

ప్రజాశక్తి-అనంతపురం

వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను జిల్లావ్యాప్తంగా ఆపార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా జిల్లా కేంద్రంలోని వైసిపి జిల్లా పార్టీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు పైలా నరసింహయ్య జెండాను ఎగురవేశారు. అనంతరం కేక్ కోసి వైఎస్‌ఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అనంతపురం పార్లమెంట్ సమన్వయకర్త ఎం.శంకరనారాయణ, ఎమ్మెల్సీ మంగమ్మ, బోయ గిరిజమ్మ, ఉర్దూ అకాడమీ ఛైర్మన్ నదీమ్ అహమ్మద్ మాట్లాడుతూ 2024 సాధారణ ఎన్నికల్లో పార్టీ విజయదుందుభి మోగిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎడిసిసిబి ఛైర్‌పర్సన్ లిఖిత, నాయకులు మీసాల రంగన్న, మాల్యవంతం మంజుల, మహాలక్ష్మి శ్రీనివాస్, కొగటం విజయభాస్కర్‌రెడ్డి, బి.ఎర్రిస్వామిరెడ్డి, వెన్నపూస రవీంద్రారెడ్డి, ధనుంజయ్‌యాదవ్, చామలూరు రాజగోపాల్, ఆలమూరు శ్రీనివాసరెడ్డి, వెన్నం శివరామిరెడ్డి, ఛైర్మన్ వెన్నపూస రామచంద్రారెడ్డి, రాళ్ల తిమ్మారెడ్డి, సివి రంగారెడ్డి, పాశం రంగస్వామియాదవ్, రమేష్‌గౌడ్, రిలాక్స్ నాగరాజు, బోయ రాజారాం, ఉమ్మడి మదన్‌మోహన్‌రెడ్డి, శ్రీదేవి, ఉషారాణి, తదితరులు పాల్గొన్నారు.

అలాగే నగరంలోని 49వ డివిజన్‌లో ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి పార్టీ జెండాను ఎగురవేశారు. అనంతరం వైఎస్‌ఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. తర్వాత కేక్ కోసి సంబరాలు చేసుకున్నారు.

అలాగే అర్బన్ నియోజకవర్గ పరిధిలోని రాజీవ్‌కాలనీలో క్లస్టర్ కన్వీనర్ హుస్సేన్, సర్పంచి ఆశాబీ ఆధ్వర్యంలో వైసిపి ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జెండా ఎగురవేశారు. తర్వాత కేక్ కోసి సంబరాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో జెసిఎస్ కన్వీనర్ ఆలమూరు శ్రీనివాసరెడ్డి, మల్లెల వేణుగోపాల్, దౌలా, రహీం, సంధ్య, ఆంజనేయులు, పసులూరు ఓబులేసు, హాజర్‌బీ, లక్ష్మీనరసమ్మ, లీలమ్మ, ఉప్పర నవీన్, పురుషోత్తమ్‌రెడ్డి, రామాంజులురెడ్డి, రంగయ్య, రాంభూపాల్‌రెడ్డి, ముస్తఫా, తదితరులు పాల్గొన్నారు.

అనంతపురం కలెక్టరేట్ : జిల్లా గ్రంథాలయ సంస్థ ఆవరణలో ఉన్న వైఎస్‌ఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి



అనంతపురం వైసిపి కార్యాలయంలో జెండాను ఎగురవేస్తున్న నాయకులు

నివాళులర్పించారు. అనంతరం కేక్ కోసి పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ ఛైర్‌పర్సన్ ఎల్‌ఎం.ఉమా మోహన్‌రెడ్డి, మాజీ ఛైర్మన్ ఎల్‌ఎం.మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

శింగనమల : వైసిపి ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం మండల కేంద్రంలోని వైఎస్‌ఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కోసి సంబరాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో సింగిల్‌విండో ప్రెసిడెంట్ బొమ్మన శ్రీరామిరెడ్డి, నాయకులు వెంకట రమణ, బెస్త ప్రసాద్, వరికూటి ఓబుళపతి, నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

రాయదుర్గం : వైసిపి ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని పట్టణంలోని వారపు సంత మైదానం, లక్ష్మీబజార్‌లో ఉన్న వైఎస్‌ఆర్ విగ్రహాలకు పాలాభిషేకం చేసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కోసి సంబరాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు మెట్టు విశ్వనాథరెడ్డి, మాధవరెడ్డి, గౌని ఉపేంద్రరెడ్డి, ఎన్.టి సిద్ధప్ప, అరవ శివప్ప, శిల్ప, శ్రీనివాస్‌యాదవ్, వలిబాషా, శ్రీనివాసులు, మల్లికార్జున, గోవిందరాజులు, శారద, లావణ్య, షబ్బీర్, వన్నూరప్ప, గోవింద, సంజీవ, మంజునాథ, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

డి.హీరేహాల్ : వైసిపి ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని మండల కేంద్రంలో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కోసి పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి పవిత్ర, జడ్పిటిసి హసీనాభాను, మండల కన్వీనర్ వన్నూరుస్వామి, సర్పంచులు హరిజన లక్ష్మి, సుదర్శన్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి, బోయ మల్లికార్జున, నాయకులు సింగాడి జగదీష్, మైనార్టీ నాయకులు రహంతుల్లా, ఖాసీపీరా, మండల బీసీ సెల్ అధ్యక్షులు పులకుర్తి చంద్ర, శివారెడ్డి, వండరప్ప పాల్గొన్నారు.

బెలుగుప్ప : మండల కేంద్రంలోని బస్‌షెల్టర్‌లో ఉన్న దివంగత నేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు అనంతరం కేక్ కోసం పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి పెద్దన్న, వైసిపి మండల అధ్యక్షుడు చిన్న మచ్చన్న, సింగిల్‌విండో అధ్యక్షులు బి.శివలింగప్ప, జి.శ్రీనివాసులు, దుద్దేకుంట రామాంజనేయులు, బెలుగుప్ప సర్పంచి సాలుబాయి, గంగ్యానాయక్, రామాంజనేయులు, శ్రీనివాసులు, మాజీ సర్పంచి జె.రామేశ్వరరెడ్డి, కరుణాకర్, తిమ్మారెడ్డి, బాబురెడ్డి, తిప్పేస్వామి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉరవకొండ : ఉరవకొండతోపాటు విడపనకల్ మండలాల్లో వైసిపి ఆవిర్భావ దినోత్సవ వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా ఉరవకొండ కార్యాలయంలో యువజన విభాగం జోనల్ ఇన్‌ఛార్జి వై.ప్రణయ్‌రెడ్డి ఆధ్వర్యంలో పార్టీ జెండాను ఎగురవేశారు. అనంతరం పార్టీ నేతలు,కార్యకర్తలు, అభిమానుల సంబరాల మధ్య కేక్ కట్ చేసి పంచి పెట్టారు. తర్వాత వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి కరణం పుష్పావతి భీమిరెడ్డి, జడ్పిటిసి హనుమంతు, మండల కన్వీనర్ బసన్న, జెసిఎస్ కన్వీనర్ భరత్‌రెడ్డి, వైసిపి నాయకులు కరణం భీమ్‌రెడ్డి, సర్పంచులు రామాంజనేయులురెడ్డి, కేసన్న, నాయకులు కరకముక్కల రాముర్రెడ్డి, సురేష్‌యాదవ్, అశోక్‌రెడ్డి, ఉలిగప్ప, నాగరాజు, రామన్న, కొల్లప్ప, డిష్ వెంకటేసులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.



ఉరవకొండలో వైఎస్‌ఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న వైసిపి నాయకులు

నేరాలు ఘోరాలు

పలు ఇళ్లలో చోరీ



బీరువాను పగులగొట్టి దుస్తులను పడేసిన దొంగలు

పామిడి : మండల కేంద్రంలోని వెంగమనాయుడు కాలనీలో తాళాలు వేసి ఉన్న రెండిళ్లు, ఒక అంగడిలో సోమవారం రాత్రి చోరీ జరిగింది. స్థానికంగా నివాసముంటున్న చంద్రశేఖర్‌శెట్టి కిరాణా అంగడి తాళాలు వేసి ఇంటికి వెళ్లిన సందర్భంలో రాత్రివేళల్లో తాళాలు పగలగొట్టి సుమారుగా రూ.30 వేలు చోరీ చేశారు. అదేవిధంగా బాబావాలి ఇంట్లో ఒక వెండి ఉంగరం, జత చిన్నకమ్మలు, రూ.3వేల నగదు చోరీకి గురయ్యాయి. అలాగే సుధాకర్ ఇంట్లో రెండు జతల వెండి గొలుసులు చోరీకి గురయ్యాయి. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

మద్యం స్వాధీనం

డి.హీరేహాల్ : మండలంలోని హులికళ్లు చెక్‌పోస్టు వద్ద అక్రమంగా తీసుకొస్తున్న కర్ణాటక మద్యాన్ని పట్టుకున్నట్లు ఎస్ఐ గురుప్రసాద్‌రెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు... మండలంలోని కళ్లెం గ్రామానికి చెందిన అన్వేష్ కర్ణాటక నుంచి అక్రమంగా తరలిస్తున్న 90 ప్యాకెట్లు మద్యంతోపాటు అన్వేష్‌ను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. ఈమేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ప్రతిభావంతులకు బహుమతులు అందజేత

గుత్తి : పదవ తరగతి మోడల్ పరీక్షల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో మంగళవారం బహుమతులు ప్రదానం చేశారు. ఇటీవల ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పట్టణంలోని కోట ప్రాంతంలో ఉన్న జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు మోడల్ పరీక్షలు నిర్వహించిన విషయం తెలిసిందే. ఇందులో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఏపీ రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు డాక్టర్ షేక్ రూఖియా బేగం, గేట్స్ ఇంజనీరింగ్ కళాశాల కరస్పాండెంట్ వీకే. పద్మావతమ్మ, డాక్టర్ ఎం. శాంతిప్రియ, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు సి.రమేష్ బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ ఇష్టపడి చదివి పదవ తరగతిలో అత్యుత్తమ ఫలితాలతో ఉత్తీర్ణులు కావాలన్నారు. విద్యార్థులపై వారి తల్లిదండ్రులు పెట్టుకున్న ఆశలను నెరవేర్చాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం సుభాన్, స్కూల్ కరస్పాండెంట్ చైతన్య, కెఎస్‌కె ట్యూషన్ నిర్వాహకుడు కె.సునీల్‌కుమార్, ఉపాధ్యాయులు దేశాయి నాగరాజు, నగేష్, రాజశేఖర్, ఎస్ఎఫ్ఐ నాయకులు ధన, బాలు, మధు తదితరులు పాల్గొన్నారు.

డాక్టరేట్ పొందిన ఉపాధ్యాయునికి సన్మానం

గుంతకల్లు : పట్టణంలోని రాధాకృష్ణ మున్సిపల్ బాలుర ఉన్నత పాఠశాలలో జీవశాస్త్ర ఉపాధ్యాయుడుగా విధులు నిర్వహిస్తున్న రామకృష్ణ డాక్టరేట్ ప్రదానం పొందిన నేపథ్యంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రవికుమార్ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనంగా సన్మానించారు. తమ పాఠశాల ఉపాధ్యాయుడు డాక్టరేట్ పొందడం గర్వకారణమన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాజేశ్వరరావు, నాగరాజు, సరస్వతి, రూప, తదితరులు పాల్గొన్నారు.

చేనేత కార్మికులతో ఆత్మీయ సమావేశం

ఉరవకొండ : చేనేత కార్మికులతో ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ మంగళవారం పట్టణంలోని దేవాంగ కళ్యాణ మండపంలో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ చేనేతల అభివృద్ధి, సంక్షేమం కోసం టిడిపి శక్తివంచన లేకుండా కృషి చేయనున్నట్లు తెలిపారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో టిడిపి గెలుపునకు సహకరించి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో చేనేత సంఘం నాయకులు పాల్గొన్నారు.

గర్భిణుల్లో రక్తహీనత నివారణకు చర్యలు

గుత్తి : గర్భిణులు రక్తహీనతకు గురికాకుండా చర్యలు తీసుకోవాలని డీఎంహెచ్‌ఓ కార్యాలయ డిప్యూటీ స్టాటిస్టికల్ అధికారి గోవిందుగౌడ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం మండలంలోని బేతాపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఎంఐఎస్ జరీనాబేగం, పీహెచ్‌ఎం హేమలతతో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా పిహెచ్‌సి, సచివాలయ ఏఎన్ఎంల రికార్డులు, గర్భిణుల కార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గర్భిణుల రికార్డులను ఎప్పటికప్పుడు నమోదు చేసుకోవాలన్నారు. ప్రతి గర్భిణికి 10గ్రాముల పైన హెచ్‌బి ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి గర్భిణికి ఐరన్, సుక్రోజ్ ఎక్కించే విధంగా ప్రణాళిక తయారు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో బేతాపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ ప్రవీణ్‌కుమార్, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఐఎస్‌సిసిఎంపై అవగాహన

అనంతపురం : సెప్సిస్ అవగాహన సదస్సులో భాగాంగా ఐఎస్-ఎస్‌సిఎంపై అనంతపురంలోని వైద్యులకు అవగాహన కల్పించారు. ఇందులో భాగంగా వివిధ పట్టాణాలకు చెందిన దాదాపు 60 మందికి పైగా వైద్యులు హాజరై సలహాలు, సూచనలు పొందారు. ఈ కార్యక్రమంలో ఐఎస్‌సిపిఎం అనంతపురం అనంతపురం విభాగం ఛైర్‌పర్సన్ డాక్టర్ రవిశంకర్, కోశాధికారి డాక్టర్ చంద్రశేఖర్, జనరల్ సెక్రటరీ డాక్టర్ హరీష్, మేనేజర్ పరమేశ్వరరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

టిడిపి కార్యకర్త కుటుంబానికి ఆర్థికసాయం


పామిడి : మండల కేంద్రంలో ఇటీవల మృతిచెందిన ఓబులేసు కుటుంబానికి గుమ్మనూరు జయరాం తమ్ముడు గుమ్మనూరు నారాయణస్వామి మంగళవారం ఆర్థికసాయం అందజేశారు. ముందుగా మృతుల కుటుంబ సభ్యులను పరామర్శి మృతికి కారణాలను అడిగి తెలుసుకున్నారు. కుటుంబానికి తెలుగుదేశం పార్టీ ఎప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. అనంరం మృతుని భార్య గోవిందమ్మకు రూ.20వేల ఆర్థికసాయం అందజేశారు. అనంతరం కత్రిమల ప్రభాకర్‌చౌదరి, బొల్లు శ్రీనివాస్‌రెడ్డి, జింకల సంజీవకుమార్, మాజీ స్టోర్ డీలర్ తిమ్మప్పను ప్రత్యేకంగా కలిసి తెలుగుదేశం పార్టీ గెలుపునకు కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆపద్బాంధవ ట్రస్టు సేవలు ప్రశంసనీయం

ఉరవకొండ : ఉరవకొండకు చెందిన ఆపద్బాంధవ ట్రస్టు వ్యవస్థాపకులు వేల్పుల మురళీ ఆధ్వర్యంలో జిల్లావ్యాప్తంగా విశేషంగా సేవలు అందిస్తుండటం అభినందనీయమని మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి, రాయలసీమ జిల్లాల జోనల్ ఇన్‌ఛార్జి వై.ప్రణయ్‌రెడ్డి కొనియాడారు. ఉరవకొండలో ఆపద్బాంధవ ట్రస్టు కార్యాలయ నిర్మాణానికి స్థలం కావాలని మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డిని కలిసి ట్రస్ట్ సభ్యులు కోరారు. ఆయన సూచనల మేరకు మేజర్ పంచాయతీ స్థానిక షిరిడీ సాయినగర్‌లో 3 సెంట్లు స్థలం కేటాయించింది. ఇందుకు కృతజ్ఞతగా ట్రస్టు సభ్యులు అనంతపురంలోని మాజీ ఎమ్మెల్యే నివాసానికి వెళ్లి .విశ్వేశ్వరరెడ్డి, ఆయన తనయుడు యువనేత వై.ప్రణయ్‌రెడ్డిని శాలువాలతో సన్మానించి మొమెంటో అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంబీసీ రాష్ట్ర డైరెక్టర్ జోగి వెంకటేశులు, ఆపద్బాంధవ ట్రస్టు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల ప్రచారంపై ప్రణాళిక సిద్ధం

కళ్యాణదుర్గం : ఎన్నికల ప్రచారంపై ముందస్తుగా ప్రణాళిక సిద్ధం చేసుకుందామని టిడిపి అభ్యర్థి అమిలినేని సురేంద్రబాబు తెలిపారు. మంగళవారం పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ స్థాయి నాయకులతో ఏర్పాటు చేసిన సమన్వయ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ త్వరలో ఎన్నికల షెడ్యూల్ రానున్న నేపథ్యంలో గ్రామ పంచాయతీల వారీగా ప్రణాళికాబద్ధంగా ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించేందుకు ప్రణాళిక రూపొందించుకుందామన్నారు. సమయం తక్కువగా ఉండటంతో ప్రతి గ్రామానికీ వెళ్లి ప్రభుత్వ వైఫల్యాలను వివరించి టిడిపి మేనిఫెస్టోను ప్రజలకు క్షుణ్ణంగా వివరించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు మోరేపల్లి మల్లికార్జున, కరణం రామ్మోహన్‌చౌదరి, లక్ష్మీనారాయణ, వైపి.రమేష్, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న అమిలినేని

ప్రభుత్వ ఉత్తర్వులపై హర్షం

ప్రజాశక్తి-గుత్తి

నూర్ బాషా (దూదేకుల) సామాజిక వర్గాన్ని కులం పేరుతో దూషిస్తే ఐపీసీ సెక్షన్ 1860 ప్రకారం శిక్ష పడేలా ప్రభుత్వ ఉత్తర్వులు జారీ చేయడం పట్ల నూర్ బాషా (దూదేకుల) సంఘం నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈమేరకు మాజీ సర్పంచి, వైసిపి పట్టణ కన్వీనర్ డి.హుస్సేన్‌పీరా, మున్సిపల్ ఛైర్‌పర్సన్ డి.వన్నూరుబీ నివాసంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఎన్నో దశాబ్దాలుగా తమ సామాజిక వర్గాన్ని అసభ్య పదజాలంతో పలువురు దూషించే వారిని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో ప్రభుత్వాలకు, ఎందరో నాయకులకు విన్నవించుకున్న పట్టించుకునేవారు కరువయ్యారని చెప్పారు. ఏ ప్రభుత్వం తమకు న్యాయం చేయలేదని వాపోయారు. అయితే సిఎం జగన్ తమ సమస్యను గుర్తించి తమ కులంను దూషించిన వారిపై చర్యలు తీసుకునేలా ఉత్తర్వులు జారీ చేయించేందుకు కృషి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి యువ నాయకుడు డి. షఫీ, న్యాయవాది నూర్‌మొహమ్మద్, నూర్‌బాషా (దూదేకుల) సంఘం నాయకులు మహబూబ్‌బాషా, జోహారాపురం మునావర్, షరీఫ్, పెద్ద కుళ్లాయి, చిన్న కుళ్లాయి, మద్దయ్య, మస్తాన్, టైలర్ షేక్షా, రియల్ ఎస్టేట్ బాషా, టి.కుళ్లాయప్ప, మహబూబ్‌పీరా, బాషా, డి.సలీం, తదితరులు పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న దూదేకుల నాయకులు

జగనన్నతోనే ఆర్యవైశ్యుల అభివృద్ధి

వాణిజ్య విభాగం రాష్ట్ర అధ్యక్షులు కుప్పం ప్రసాద్

ప్రజాశక్తి-అనంతపురం

సిఎం జగనన్నతోనే ఆర్యవైశ్యుల అభివృద్ధి సాధ్యమని వాణిజ్య విభాగం రాష్ట్ర అధ్యక్షులు కుప్పం ప్రసాద్ అన్నారు. మంగళవారం నగరంలోని వైసిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నవరత్నాల ద్వారా వైశ్యులు ఆర్థిక ప్రగతి సాధించారన్నారు. పాదయాత్రలో ఇచ్చిన హామీ ప్రకారం అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి వర్ధంతిని అధికారికంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. వైసిపి ప్రభుత్వంలో ఏటా నవంబర్ 1న రాష్ట్ర అవతరణ దినోత్సవం జరిగేలా సీఎం జగన్ చర్యలు తీసుకున్నారన్నారు. వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయాలను తమ పరిధిలోకి వచ్చేలా జీఓ ఇచ్చారన్నారు. వ్యాపారాలు వృద్ధి చెందేందుకు చర్యలు తీసుకున్నారన్నారు. అనంతరం ఆర్యవైశ్యులు కుప్పం ప్రసాద్‌ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో గూడూరు మల్లికార్జున, కార్పొరేటర్ పాలాక్షిరెడ్డి, సంపత్‌కుమార్, కలవాల్ సతీష్, మచ్చ మధుసూదన్, సత్రసాల మంజునాథ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వాణిజ్య విభాగం రాష్ట్ర అధ్యక్షులు కుప్పం ప్రసాద్

భవన నిర్మాణ కార్మికుల సంక్షేమానికి కృషి

వైసిపి రాయలసీమ జిల్లాల జోనల్ ఇన్‌ఛార్జి వై.ప్రణయ్‌రెడ్డి

ప్రజాశక్తి-ఉరవకొండ

భవన నిర్మాణ కార్మికుల సంక్షేమానికి సీఎం జగన్ కృషి చేస్తున్నారని రాయలసీమ జిల్లాల జోనల్ ఇన్‌ఛార్జి వై.ప్రణయ్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఉరవకొండ షిరిడీ సాయి నగర్‌లోని సంఘం కార్యాలయం వద్ద భవన నిర్మాణ కార్మికులతో ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడుతూ విశ్వేశ్వరరెడ్డితో మాట్లాడి కార్మికుల సమస్యల పరిష్కారానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఎన్నికల తర్వాత కార్మికుల ఇబ్బందులు పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. వచ్చే ఎన్నికల్లో వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి వై.విశ్వేశ్వరరెడ్డికి ఓటు వేసి అండగా నిలవాలని కోరారు. అంతకుముందు ఉరవకొండలోని 10, 11వ వార్డులు, శివరామిరెడ్డి కాలనీలో రూ.10 లక్షలతో ఎఫ్ఎఫ్‌సి మండల నిధులతో చేపట్టిన సీసీ రోడ్లు, తాగునీటి పైప్‌లైన్ నిర్మాణ పనులకు స్థానిక ప్రజాప్రతినిధులు వైసిపి నాయకులతో కలిసి శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు, కార్మికులు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



అభివృద్ధి పనులకు భూమిపూజ చేస్తున్న వై.ప్రణయ్‌రెడ్డి

రెచ్చగొట్టే పోస్టులు పెడితే చర్యలు

నార్పల : సోషల్ మీడియాలో రెచ్చగొట్టే పోస్టులు పెడితే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ రాజశేఖర్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. సామాజిక మాధ్యమాల్లో అసభ్యకరమైన చిత్రాలు, వీడియోలను పోస్ట్ చేయవద్దన్నారు. వ్యక్తిగత దూషణకు దిగడం, హెచ్చరికలు జారీ చేయడం, అంతర్గత వివరాలపై పోస్టులు, కామెంట్స్ పెట్టవద్దన్నారు. సోషల్ మీడియాను నిరంతరం పోలీసులు గమనిస్తూనే ఉంటారన్నారు. సమాజంలోని వ్యక్తులు, సంస్థలపై తప్పుడు, రెచ్చగొట్టే ఆరోపణలు చేసినా, శాంతి భద్రతలకు విఘాతం కలిగించే విధంగా విద్వేషకర పోస్టులు చేస్తే తగిన చర్యలు తప్పవన్నారు.

జామియా మసీదు వద్ద సహరీ ఏర్పాట్లు

నార్పల : పవిత్ర రంజాన్ మాసం ప్రారంభం కావడంతో మండల కేంద్రంలోని జామియా మసీదు (పెద్ద మసీదు)లో సహరీ కోసం భోజన ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా యువకులు మాట్లాడుతూ గత మూడేళ్ల నుంచి జామియా మసీదులో సహరీ ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. కొందరి ముస్లిములకు ప్రతి ఇంట్లో తెల్లవారుజామున సమయంలో భోజనాలు చేసుకోవడం ఇబ్బందికరంగా ఉంటుందని, అలాంటి వారి ఉపవాసం తప్పి పోకూడదన్న సదుద్దేశంతో ఈ ఏర్పాట్లు చేస్తున్నట్లు వివరించారు.

ప్రజల సంపూర్ణ ఆరోగ్యమే లక్ష్యం : ఎంపిడిఒ

నార్పల : పేదల సంపూర్ణ ఆరోగ్యమే సిఎం జగనన్న ఆరోగ్య సురక్ష లక్ష్యమని ఎంపిడిఒ రాముడు అన్నారు. మంగళవారం మండల మండల పరిధిలోని గంగనపల్లి సచివాలయ ఆవరణలో జగనన్న ఆరోగ్య సురక్ష మెగా వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పలువురు గ్రామస్థులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. ప్రభుత్వం ప్రవేశపెట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం పేదలకు వరం అన్నారు. కార్పొరేటు వైద్యానికి దీటుగా జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా పేదలకు మెరుగైన వైద్యం అందించడం ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో ఐఆర్‌డి శైలజారాణి, పప్పూరు ప్రాథమిక వైద్యశాల డాక్టర్లు మహేంద్ర, జాహిరా, సూపర్‌వైజర్ శ్రీరాములు, ఎంపిహెచ్ఇఒ మల్లికార్జున, ఏఎన్ఎంలు, ఆశాకార్యకర్తలు, వైద్య సిబ్బంది, గ్రామ పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

వైసిపి ఎస్సీ సెల్ జిల్లా కార్యదర్శిగా వీరాంజనేయులు

శింగనమల : మండల కేంద్రానికి చెందిన మంత్రిగారి వీరాంజనేయులును వైసిపి ఎస్సీ జిల్లా కార్యదర్శిగా ఎంపిక చేసినట్లు సింగిల్‌విండో అధ్యక్షుడు బొమ్మన శ్రీరామిరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా వీరాంజనేయులు మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి ఎస్సీ సెల్ జిల్లా కార్యదర్శిగా నియమించినందుకు ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, ప్రభుత్వ సలహాదారులు ఆలూరు సాంబశివారెడ్డి, నియోజకవర్గ సమన్వయకర్త ఎం.వీరాంజనేయులుకు కృతజ్ఞతలు తెలిపారు. రానున్న ఎన్నికల్లో వైసిపి గెలుపే ధ్యేయంగా పని చేస్తానని తెలిపారు.

పదో తరగతి పరీక్షల ఏర్పాట్లు పరిశీలన

బొమ్మనహాల్ : మండల కేంద్రంతోపాటు మండల పరిధిలోని ఉద్దేహాల్ ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి పరీక్షల ఏర్పాట్లను ఎంఇఒ మల్లికార్జున మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు సరిపడ బెంచీలతోపాటు గాలి, వెలుతురు, మంచినీరు వంటి సౌకర్యాలు ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పకడ్బందీగా పరీక్షలు నిర్వహించేందుకు సిబ్బంది సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసరెడ్డి, ఎంఆర్‌సి సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా మహిళా దినోత్సవం

పుట్లూరు : మండల కేంద్రంలోని ఐకెపి కార్యాలయంలో మంగళవారం మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మహిళలను సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండల సమాఖ్య అధ్యక్షురాలు, ఎంఎస్ ఆఫీస్ బేరర్లు, ఎపిఎం, సీసీలు, అకౌంటెంట్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పాలనను కొనసాగించుకుందాం



బ్రిడ్జి నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న నాయకులు

శింగనమల : ప్రతి ఇంటికీ సంక్షేమం అందిస్తున్న వైసిపి ప్రభుత్వాన్ని రానున్న ఎన్నికల్లో కూడా గెలిపించుకుని సంక్షేమాన్ని కొనసాగించుకుందామని ప్రభుత్వ సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి, సమన్వయకర్త వీరాంజనేయులు పిలుపునిచ్చారు. మంగళవారం మండల పరిధిలోని పోతురాజుకాలువ-సోదనపల్లి వద్ద ఉన్న మరవవంకపై బ్రిడ్జి నిర్మాణ పనులకు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైసిపి అధికారంలోకి వచ్చాక అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. అంతేగాకుండా సచివాయాలు, వాలంటీర్ల వ్యవస్థల ద్వారా అవినీతి రహితంగా సంక్షేమ పథకాలను అందజేస్తున్న ఘనత సిఎం జగన్‌కే దక్కుతుందన్నారు. ఆయా పథకాలు ఇలానే కొనసాగలంటే రానున్న ఎన్నికల్లో వైసిపికి ఓటు వేసి గెలిపించుకుందామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వైసిపి జిల్లా అధ్యక్షులు పైలా నరసింహయ్య, పార్లమెంట్ సమన్వయకర్త మాలగుండ్ల శంకరనారాయణ, నియోజకవర్గ పరిశీలకులు తాడిపత్రి రమేష్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రంజాన్ తోఫా పంపిణీ

గుత్తి : పట్టణ శివారు లోనీ గుత్తి-అనంతపురం రోడ్డులో ఉన్న మదరసాలో మంగళవారం సఫా బైతుల్ మాల్ ఆధ్వర్యంలో పేద ముస్లిం కుటుంబాలకు ఉచితంగా రంజాన్ తోఫా పంపిణీ చేశారు. రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని బియ్యం, గోధుమపిండి, బేడలు, సేమియాలు, బెల్లం, నెయ్యితో కూడిన వస్తువులను అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచి, వైసిపి పట్టణ కన్వీనర్ డి.హుస్సేన్‌పీరా, వక్ఫ్ బోర్డ్ సభ్యులు ఫయాజ్ బాషా, సఫా బైతుల్ మాల్ కమిటీ నాయకులు బీకే.రహీం,హఫీజ్ ఖాలిద్, హఫీజ్ యాసిన్, అబ్దుల్, వలి తదితరులు పాల్గొన్నారు.